



# రసమయిని అభినందించిన గులాబీ బాస్

ఈ నెల 27న వరంగల్ లో బీఆర్ఎస్ రజజోత్సవ సభ నిర్వహించ నున్న విషయం తెలిసిందే. ఇప్పటికే సభ కు అంకురార్పణ చేశారు. జిల్లాల వారీగా బీఆర్ఎస్ అధినేత పార్టీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యే లు, జిల్లా అధ్యక్షులు, నాయకులతో వరుసగా సన్నాహక సమావే శాలు నిర్వహిస్తున్నారు. గురువారం ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల నేతలతో సమావేశమయ్యారు. ఈ పార్టీ రజతోత్సవ సభ కోసం మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్ బండెనక కట్టి... బండి కట్టి రాశారు. ఈ పాటను కేసీఆర్ ఆవిష్కరిం చారు. అనంతరం గులాబీ బాస్ రసమయి ని అభినందించారు.

- శెనార్తి మీడియా, మానకొండూర్ ప్రతినిధి

# కేంద్రమంత్రులతో ఆదిలాబాద్ బీజేపీ ప్రజాప్రతినిధుల భేటీ

**శెనార్తి మీడియా, ఉమ్మడి ఆదిలాబాద్ ప్రతినిధి:**



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధి అంశాలపై కేంద్ర మంత్రులతో ఆదిలాబాద్ బీజేపీ ప్రజాప్రతినిధులు ఢిల్లీలో భేటీ అయ్యారు. పార్లమెంట్ హౌస్‌లో రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరి, పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుతో వారు సమావేశమయ్యారు.

**జాతీయ రహదారుల అభివృద్ధిపై చర్చ**

నితిన్ గడ్కరిని కలిసిన ప్రతినిధులు, జాతీయ రహదారుల అభివృద్ధి, విస్తరణ, కొత్త ప్రాజెక్టుల మంజూరుపై చర్చించారు. ఈ మేరకు వినతిపత్రాన్ని అందజేశారు.

**ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు ఆమోదంపై హర్షం**

ఆదిలాబాద్‌లో ఎయిర్‌పోర్ట్‌కు మంజూరు తెలిపిన రామ్మోహన్ నాయుడును బీజేపీ నేతలు సన్మానించారు. మౌలిక సదుపాయాల విస్తరణకు కేంద్రం మరింత సహకరించాలంటూ విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఆదిలాబాద్ ఎంపీ గోడం నాగేశ్, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామరావు పాటిల్, సిర్పూర్ ఎమ్మెల్యే డా. పాల్వాయి హరీష్ బాబు పాల్గొన్నారు.

# రైతులకు నేరుగా మార్కెటింగ్ అవకాశం కల్పించాలి: రైతు జేఏసీ



**శెనార్తి మీడియా, కరీంనగర్ :**

దళారీ వ్యవస్థను రద్దు చేసి, రైతులు నేరుగా వినియోగదారులకు కూరగాయలు, ఆకుకూరలు విక్రయించేలా ప్రభుత్వం అవకాశం కల్పించాలని రైతు జేఏసీ సభ్యులు డిమాండ్ చేశారు. కరీంనగర్ లోని ఫిలిం భవన్‌లో మంగళవారం రైతు జేఏసీ సభ్యులు మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా జేఏసీ నేతలు జంగా చంద్రారెడ్డి, శ్రీనివాస్ అరెల్లి, పుల్లెల జగన్ మోహన్ పటేల్, బోనాల మోహన్ పటేల్ తదితరులు మాట్లాడుతూ, దళారీ వ్యవస్థ వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్య పరిష్కారానికి ముఖ్యమంత్రికి 10 ప్రధాన డిమాండ్లతో లేఖ రాశారు.

**రైతులకే సమీకృత మార్కెట్లు కేటాయించాలి**

కరీంనగర్ నగరంలో ఇప్పటికే నిర్మించిన, నిర్మిస్తున్న సమీకృత మార్కెట్లను కూరగాయల రైతులకు కేటాయించాలని జేఏసీ నేతలు ప్రభుత్వాన్ని కోరారు. నెల రోజులుగా రైతులకు మార్కెట్లు కేటాయించకపోతే భారీ స్థాయిలో నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని రైతులను ఏకం చేసి దేశవ్యాప్త ఉద్యమానికి సిద్ధమవుతున్నామని తెలిపారు.

**వ్యవసాయ అధికారుల నిర్లక్ష్యం**

రైతులు విత్తనాల కొనుగోలులోనుంచి, పంటను విక్రయించే దశ వరకు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలనలు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని జేఏసీ నేతలు మండిపడ్డారు. రైతులకు తగిన సూచనలు ఇవ్వాలని వ్యవసాయ అధికారులను నిలదీశారు. ప్రతి కూరగాయ పంటలో రైతులకు ఎకరాకు రూ.30 నుంచి రూ.40 వేల వరకు నష్టం వాటిల్లుతోందని వివరించారు.

**రైతుల నుంచి నేరుగా కొనుగోలు చేయాలి**

ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో టెండర్ విధానాన్ని రద్దు చేసి, నేరుగా రైతుల నుంచి కూరగాయలు, ఆకుకూరలు కొనుగోలు చేయాలని, అలాగే కనీస మద్దతు ధర ఏర్పాటు చేసేందుకు రైతు కమిటీలకు అధికారాన్ని ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో కరీంనగర్ జిల్లాకు చెందిన 30 మంది రైతులు పాల్గొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమ రాం రెడ్డి, నూనె రాజేందర్, సురేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## మాస్టిన్ కుల ధ్రువీకరణ పత్రాల జారీపై

# ప్రభుత్వం స్పందించాలి

- మాస్టిన్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగిళ్ల నరసయ్య

**శెనార్తి మీడియా, కరీంనగర్:** మాస్టిన్ కులస్తులకు కుల ధ్రువీకరణ పత్రాల జారీలో ఎదురవుతున్న సమస్యలపై ప్రభుత్వం స్పందించాల్సిన అవసరం ఉందని మాస్టిన్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగిళ్ల నరసయ్య పేర్కొన్నారు. కుల ధ్రువీకరణ పత్రాలు ఆర్డీవో స్థాయిలో కాకుండా తహసిల్దార్ కార్యాలయాల నుంచే ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. గురువారం కరీంనగర్ పట్టణంలోని అంబేద్కర్ నగర్‌లో మాస్టిన్, మాష్టి కులస్తుల రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహిం చారు. ఈ సమావేశంలో మాస్టిన్ సంఘం కరీంనగర్ జిల్లా అధ్యక్షుడిగా మాన్యం శేఖర్‌ను ఎన్నుకున్నారు. ఈ సంద ర్భంగా నాగిళ్ల నరసయ్య మాట్లాడుతూ, కుల ధ్రువీకరణ పత్రాలు లేని కారణంగా మాస్టిన్ కులస్తులు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు నోచుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక మంది వడ్రంగి పనులు చేస్తూ, మరికొంతమంది చీపుర్లు తయారు చేసి గ్రామాల్లో తిరుగుతూ జీవనం కొనసాగిస్తున్నారని వివరించారు. చదువుకున్న యువతకు ఉపాధి లేక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. మాస్టిన్, మాష్టి కులస్తులను ప్రభుత్వం గుర్తించి అవసరమైన మద్దతు అందించాలన్నారు. కుల ధ్రువీకరణ పత్రాల జారీ ప్రక్రియను సులభతరం చేయాలని, తహసిల్దార్ కార్యాలయాల నుంచే వాటిని జారీ చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జాతీయ అధ్యక్షులు నాగిళ్ల బాబురావు, రాష్ట్ర గౌరవ అధ్యక్షులు నాగిళ్ల కిష్టయ్య, రాష్ట్ర కన్వీనర్ బుద్ధుల రమేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు దర్శనం శంకర్, సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు దర్శనం రాములు, ఎంఎస్‌పి కన్వీనర్ దండు అంజన్న, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకురాలు దండు వరలక్ష్మి, మహిళా నేతలు ఓరుగంటి మారెమ్మ, మన్నెం నాంచారమ్మ, నాగేల్లి నరసమ్మ, ఓరిగంటి పద్మ, ఓరుగంటి సూరమ్మ తదితరులు పాల్గొన్నారు. నూతనంగా ఎన్నికైన మాన్యం శేఖర్‌కు శాలువా కప్పి అభినందనలు తెలిపారు. మాస్టిన్ కుల హక్కుల సాధన కోసం రాష్ట్ర నాయకత్వంతో కలిసి పని చేస్తానని శేఖర్ తెలిపారు.

# ఆస్తి పన్నుల వసూళ్లలో రికార్డు

- మున్సిపల్ కమిషనర్‌కు ప్రశంసాపత్రం




**శెనార్తి మీడియా, మంచిర్యాల :**

2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను పట్టణం లో ఆస్తి పన్నుల వసూళ్లలో 77.35% సాధించడంతో పట్టణ మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాజలింగు ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. గురువారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పురపాలక పరిపాలన శాఖ కమీషనర్, డైరెక్టర్ టీకే శ్రీదేవి చేతుల మీదుగా ఆయన ఈ గౌరవాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ... రికార్డు స్థాయిలో ఆస్తి పన్నులు వసూలు చేయడంపై ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. అనంతరం రాజలింగును ప్రశంసా పత్రం అందించి సన్మానించారు. కమిషనర్ రాజలింగం మాట్లాడుతూ.. పట్టణంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను 100% ఆస్తి పన్ను వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టుకుని, తగిన ప్రణాళికలు రూపొందించనున్నాం. మున్సిపల్ అధికారులు, సిబ్బంది అందించిన సహకారం మరువలేనిది. ఈ ఏడాదికూడా మెరుగైన వసూళ్లు సాధించే దిశగా కృషి చేస్తాం అని పేర్కొన్నారు.



# వ్యవసాయ కళాశాల మంజూరుపై హర్షం

**శెనార్తి మీడియా, బెజ్జంకి :**

బెజ్జంకి మండలానికి వ్యవసాయ కళాశాల మంజూరు చేయించిన మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్య నారాయణకు బేగంపేట ఉన్నత పాఠశాల విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. సిద్దిపేట జిల్లా ఎన్ఎస్‌యూఐ ప్రధాన కార్యదర్శి పిట్టల అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు. వ్యవసాయ కళాశాల మంజూరు కావడంపై పాఠశాల అధ్యాపకులు, గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. "వ్యవసాయ రంగాన్ని శాస్త్రీయంగా అభివృద్ధి చేయడానికి, నూతన పరిశోధనలు, కొత్త సాంకేతికతలు రైతులకు చేరువ చేయడానికి ఇలాంటి విద్యాసంస్థలు ఎంతో మేలు చేస్తాయని పేర్కొన్నారు. నియోజకవర్గ అభివృద్ధిలో ఎమ్మెల్యే కృషిని ప్రశంసించారు.

# శిక్షణను సద్వినియోగం చేసుకోండి

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

ఉద్యోగుల్లో నైపుణ్యాలు పెంపొందించేందుకు శిక్షణ ఎంతో అవసరమని జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్. యాదయ్య అన్నారు. గరిమెళ్ల ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్న ప్రధానోపాధ్యాయుల శిక్షణ శిబిరంలో ఆయన మాట్లాడుతూ పాఠశాల నాయకత్వం విద్యార్థుల అభివృద్ధికి కీలకం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష కోఆర్డినేటర్లు, రిసోర్స్ పర్సన్లు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు

# ఎమ్మార్పీకి మించి ఎరువులు అమ్మితే చర్యలు

- ఆగ్రహించిన వ్యవసాయ అధికారి

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**



మంచిర్యాల జిల్లా భీమారం మండలంలో ఎరువులు, పురుగు మందుల దుకాణాలపై మండల వ్యవసాయ అధికారి అత్తె సుధాకర్ గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రైతులకు అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే సహించేది లేదని, ఎవరైనా ఎమ్మార్పీకి మించి అమ్మితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

**అధిక ధరలకు అమ్మితే దుకాణాల సీజ్..**

ఈ తనిఖీల సందర్భంగా దుకాణదారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిన సుధాకర్ రైతులు ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు కొనుగోలు చేసిన వెంటనే వారికి తప్పనిసరిగా రసీదు ఇవ్వాలి. ఎరువుల విక్రయం ఈ-పాస్ ద్వారా మాత్రమే జరగాలి. నిబంధనలు పాటించకుండా అధిక ధరలకు విక్రయిస్తే దుకాణాలను సీజ్ చేయడం సహా కఠిన చర్యలు తీసుకుంటాం అని హెచ్చరించారు. రైతులను మోసం చేసే ఏ చర్యనైనా ఉపేక్షించేది లేదని, వాస్తవ ధరలకే ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు లభించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

## మంచిర్యాల కలెక్టర్‌ను కలిసిన

# కన్స్యూమర్ రైట్ ఆర్గనైజేషన్ నేతలు



**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

నేషనల్ ప్రెసిడెంట్ నవీన్ శర్మ, స్టేట్ ప్రెసిడెంట్ రామగిరి హరిబాబు ఆదేశాల మేరకు ఇటీవల ఏర్పాటైన కంజ్యూమర్ రైట్ ఆర్గనైజేషన్ జిల్లా కమిటీ నాయకులు మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి, జిల్లా సివిల్ సప్లై అధికారులను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో వినియోగదారుల హక్కుల పరిరక్షణ, నాణ్యమైన సేవల అందుబాటుకు తీసుకోవాల్సిన చర్యలు, ప్రజల సమస్యలు వంటి అంశాలపై అధికారులతో నేతలు చర్చించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా ప్రెసిడెంట్ బి. రాజశేఖర్, వైస్ ప్రెసిడెంట్ శివ, జనరల్ సెక్రటరీ రమేష్, శ్రావణ్, ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా దొడ్డి కొమురయ్య జయంతి

**శెనార్తి మీడియా, కరీంనగర్:**



తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య 98వ జయంతి వేడుకలను కరీంనగర్ కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. అమరుడు దొడ్డి కొమురయ్య చిత్రపటానికి తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాటం చేసి అమరుడైన దొడ్డి కొమురయ్య భవిష్యత్తు తరాలకు స్ఫూర్తిదాయకమని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యులు కుస్త్రం నీలాదేవి, కొంకటి లక్ష్మీనారాయణ, జిల్లా శంకర్, రేణిగుంట్ల ప్రవీణ్, రాంబాబు నాయక్, వివిధ ప్రజా సంఘాల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# ఎల్.ఆర్.ఎస్ గడువు ఏప్రిల్ 30 వరకు పొడిగింపు

**శెనార్తి మీడియా, కరీంనగర్ :**

అనధికార లేఔట్ల క్రమబద్ధీకరణ, ప్లాట్ల రెగ్యులరైజేషన్‌లో 25 శాతం రాయితీ గడువు ఏప్రిల్ 30 వరకు పొడిగించారని కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. మార్చి 31తో గడువు ముగియగా, ప్రజల అభ్యర్థనల మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.